


కార్తీకం..శివోహం

నేటి నుంచి కార్తీకమాసం - జిల్లాల్లో ఎన్నో శైవక్షేత్రాలు

పిఠాపురం/సామర్లకోట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో చేసే స్నాన, జప, తప, దాన, వ్రతాదులు అనంతమైన పుణ్య ఫలాలు ఇస్తా యని భక్తుల ప్రగాఢ నమ్మకం.అందుకే ఈ మాసమంతా ఆధ్యాత్మికతే కనిపి స్తుంది. మాలధారణలు, సంప్రదాయాలు ఉట్టిపడతాయి. ఏ శైవ క్షేత్రానికి వెళ్లినా ఓం నమశ్శివాయ అనే శివపంచాక్షరీనామమే ప్రతిధ్వనిస్తుంది. శరదృతువులో వచ్చే కార్తీకమాసంలో చంద్రుడు కృత్తికా నక్షత్రంలో సంచరిస్తాడు కాబట్టి కార్తీకమాసమని పేరు వచ్చిం దని చెబు తుంటారు. కార్తీకమాసం శివకేశవులు ఇద్దరికీ ప్రీతి దాయకం.కార్తీకమాసంలో ఆలయాల సందర్శనకు ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సు లు నడుపుతున్నారు.ఈ మాసంలో వనసమారాధనలు జరుగుతాయి.

ఆలయాలివిగో..

- ఈ మాసంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోదావరి తీరం చాలా ప్రత్యేకం. తెల్లవారుజామునే మహిళా భక్తులు గోదావరిలో స్నానాలు ఆచరిస్తారు.నదిలో దీపాలు వదులుతారు. అక్కడే ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. గోదావరికి అటువైపున ఉన్న కొవ్వూరులోను తెల్లవారుజామున స్నానాలు, ఆచరిస్తారు.బిక్కవోలు, కొవ్వూరు, నిడదవోలు, ఉండ్రాజవరంలో కార్తీకమాసంలో దర్శించదగ్గ ఆలయాలున్నాయి. బిక్కవోలులో 1100 ఏళ్ల కిందటి గోలింగేశ్వరస్వామి ఆలయం, ఇళ్లపల్లిలోని 108 స్తం భాల గుడి, బలభద్రపురంలోని శివాలయంలో ద్వాదశ జ్యోతిర్లింగాలు చూడవచ్చు. ధవళేశ్వరంలో అగస్త్యేశ్వరుడు, రాజమహేంద్రవరంలో మార్కండేశ్వరుడు, ఉమా కోటిలింగేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి.ఇటీవలే నిర్మించిన ఉజ్జయిని మహాకాలేశ్వరాలయం.
- కాకినాడ జిల్లాలోని దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రం కార్తీకానికి ముస్తాబైంది. సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం, అన్నవరం సత్యదేవుడి ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కాట్రేనికోన మండలం కుండలేశ్వరం, ఐ.పోలవరం మండలం మురమళ్ల వీరేశ్వరస్వామి, అయినవిల్లి మండలం ముక్తేశ్వరస్వామి, కె.గంగవరం మండలం కోటిపల్లి, పంచారామల్లో ఒకటైన ద్రాక్షారామ, కొత్తపేట మండలం పలివెల కొప్పేశ్వరుడు,అంబాజీపేట మండలం వ్యాఘ్రేశ్వరంలోని వ్యాఘ్రేశ్వరస్వామితో పాటు ఏకా దశరుద్రులుగా పేరుగాంచిన 11 ఆలయాలు దర్శించుకుంటే పుణ్యఫలమని ప్రతీతి.

నేటి నుంచి ఆరంభం

ఈ ఏడాది కార్తీకం బుధవారం ప్రారంభమై వచ్చే నెల 20న ముగుస్తుంది. ఈ మాసంలో ప్రతిరోజూ ఓ పండుగే. నాలుగు సోమవారాలతోపాటు కార్తీకపౌర్ణమి ఎంతో విశిష్టమైనవి. అట్లతద్ది వాయినాలు తీర్చుకోలేని వారు సోమవారం పౌర్ణమి నాడు తీర్చుకుంటారు. ఈనెల 23న యమ విధియ. ఆ రోజున సోదరి ఇంట సోదరులు భోజనం చేసి కానుకలు ఇచ్చి రావాలి. 25న నాగులచవితి. పుట్టలో పాలుపోసి సుబ్రహ్మణ్యేశ్వరుని ఆరాధిస్తారు. 30న గోపాష్టమి, నవంబరు 2న చిలుక ద్వాదశిని పురస్కరించుకుని క్షీరాబ్ది పూజ చేస్తారు. 4న వైకుంఠ చతుర్దశి, 5న కార్తీక పౌర్ణమి, జ్వాలా తోరణం. 18న మాసశివరాత్రి, 21న పోలిస్వర్గం, పాడ్యమి దీపాలు విడిచిపెడతారు.



కాలిన.. కాలుష్యం!

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

దీపావళి అంటే సందడే సందడి. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటారు.ఈ దీపావళి పండగకు ఉమ్మడి జిల్లాలో బాణ సంచా మోతమోగింది. జువ్వలు, బాంబులు, చిచ్చుబుడ్లు, లక్ష్మీ టపాసులు పేలాయి. రంగురంగుల మందుగుండు నిప్పులు చిమ్ముతూ పొగలుకక్కాయి. పండగ సంతోషంతో జనం ఎక్కడికక్కడ మందుగుండు భారీగా పేల్చారు. ఒక్కసారిగా పేలిన టపాసులతో గాల్లో కాలుష్యం తీవ్రత పెరిగింది. పొగ నిండిపోయి గాలి నాణ్యత దెబ్బతింది. ముఖ్యంగా సోమవా రం రాత్రి 7 గం టల నుంచి అర్ధరాత్రి 12 గం టల వరకు గాలి నాణ్యతను సూచించే ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఏకంగా రెడ్‌సిగ్నల్‌లోకి చేరింది. బాణ సంచావల్ల అత్యధిక కాలుష్యం అమలా పురంలో నమో దైంది.

పొగ 'మోతెక్కింది'

- హోరెత్తిన బాణసంచా పేలుడు
- ప్రమాదకర స్థాయికి చేరిక
- అమలాపురంలో ఏక్యూఐ 243
- రాజమహేంద్రవరంలో 212
- కాకినాడ నగరంలో 174
- 100 దాటితే శ్వాస ఆడదు

అమలాపురాన హై...

ఉమ్మడి జిల్లా మొత్తం మీద అమలాపురం పట్టణంలో గాలి నాణ్యత దారుణంగా పడిపోయింది. వాయుకాలుష్యం అత్యధికంగా ఇక్కడే నమోదైంది. పండగరోజు సోమవారం సాయం త్రం ఆరు గంటలకు ఏక్యూఐ 65 నుంచి ఏకంగా 138కి చేరింది. రాత్రి 7 గంటలకు 229, 8 గంటలకు 243, 9 గంటలకు 222, 10 గంటలకు 212, 11గంటలకు 198, అర్ధరాత్రి 12గంటలకు 164 నమోదైంది. తిరిగి మంగళవారం 11గంటల తర్వాత వాయు కాలుష్య తీవ్రత తగ్గిపోయి తిరిగి 56కి చేరింది.

రాజమండ్రిలో ఇలా..

రాజమహేంద్రవరంలోను వాయు కాలుష్యం భారీగా వెదజల్లింది. సోమవారం సాయంత్రం 5 గంటలకు ఏక్యూఐ 82గా నమోదైంది. 6 గంటలకు 121, 7గంటలకు 196, 8 గంటలకు 212, 9గంటలకు 199, 10 గంటలకు 197, 11గంటలకు 198, 12గంటలకు 164 చొప్పున నమోదైంది.మంగళవారం ఉదయం 10గంటల తర్వాత 62కి చేరింది.

కాకినాడలో కాస్త బెటర్

కాకినాడ నగరంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు ఏక్యూఐ 156 ఉండగా, 7గంటలకు 174, 8గంటలకు 173, 9 గంటలకు 164, 10 గంటలకు 167, 11 గంటలకు 166, 12గంట లకు 151 నమోదైంది. అర్ధరాత్రి ఒంటిగంటకు 138, 2గంటలకు 103 నమోదవగా ఉదయం 8 గంటలకు తిరిగి 66కి చేరి గాలి నాణ్యత మెరుగైంది.

స్వచ్ఛమైన గాలి లేదు!

గాలిలో నాణ్యత సూచిక (ఏక్యూఐ) ఆధా రంగా కాలుష్య నియంత్రణ బోర్డు మార్గదర్శకాలు రూపొందించింది. ఏక్యూఐ సంఖ్య 50 పాయింట్లలోపు ఉంటే అక్కడ గాలి నాణ్యత బాగుం దని అర్థం. 50 నుంచి 100 వరకు ఉంటే మోడరేట్, 100 నుంచి 150 వరకు ఉంటే పూర్, 150 నుంచి 200మధ్య ఉంటే అన్‌హెల్తీ వాతా వరణం కింద భావించాలి. పండగ రోజు రాత్రి కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంలో వాయుకాలుష్య తీవ్రత పెరిగిపోయింది. ఏక్యూఐ 100 దాటితే ఆస్తమా, కిడ్నీ, గుండె జబ్బులతో బాధపడుతున్న వారు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారుతుంది. ఏక్యూఐ 200 దాటితే శ్వాస సమస్యలు ఎదుర్కొంటారు.ఎందుకంటే మందుగుండు పేలుడుతో వెదజల్లే వాయు కాలుష్యంలో కార్బన్ డయాక్సైడ్, నైట్రోజెన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ మోతాదు అధికం. దీనివల్ల శ్వాస సమస్యలు వస్తాయి. దీపావళి రోజు రాత్రి ఏకంగా అమలాపురం, రాజమహేంద్రవరంలో ఏక్యూఐ 200 పాయింట్లు దాటేసింది.

పోలీసు వీరుల సేవలు ఎనలేనివి



పోలీసు అమరులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్

- కలెక్టర్ షాన్ మోహన్
- ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినం
- ఎమ్మెల్యేలు చినరాజప్ప, కొండబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ నివాళులు



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ



కాకినాడ/కాకినాడ క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దేశంలో శాంతిభద్రతలను కాపాడుతూ, ప్రజారక్షణకు ప్రాణాలను సైతం అర్పిస్తున్న పోలీసు వీరుల సేవలు ఎనలేనివని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ బిందుమాధవ్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడసిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావులతో కలిసి అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు ఉంచి పోలీసు అ మరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసుల నుంచి వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివన్నారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో నిమగ్నమై, విధినిర్వహణలో అసువులు బాసిన, అమర పోలీసుల కుటుంబాలకు నివాళులర్పించారు. విధి నిర్వహణలో భాగంగా పోలీసుశాఖలో పనిచేసే అందరికీ ఉత్తేజాన్ని ఇవ్వాలని, వారు భౌతికంగా మరణించినా, మన హృదయాల్లో చిరస్మరణీయులుగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు ఈ ఏడాది దేశంలో, రాష్ట్రంలో విధి నిర్వహణలో మరణించిన పోలీసు అమరవీరుల పేర్లను చదవి వినిపించారు. దేశవ్యాప్తంగా 191మంది పోలీసులు అమరులు కాగా అందులో రాష్ట్రానికి చెందిన ఐదుగురు ఉన్నారన్నారు. పోలీసు అమరవీరులను సంస్మరిస్తూ పెరేడ్ కమాండర్, ఇన్‌స్పెక్టర్ ఎంఎస్ మూర్తినేతృత్వంలో సాయుధ పోలీసు దళం స్మృతి పెరేడ్ నిర్వహించింది. కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. పోలీసు అమరవీరులకు స్మృతి నివాళులర్పించారు. అనంతరం జిల్లాలో అమరులైన 14మంది పోలీసు అమరవీరుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10వేల నగదు, పండ్లను కలెక్టర్ షాన్ మోహన్, జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అందించారు. వారితో ఆత్మీయంగా ముచ్చటించి పోలీసు అమరవీరుల కుటుంబాన్ని అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. పెద్దాపురం, కాకినాడ సిటీ ఎమ్మెల్యేలు నిమ్మకాయల చిన రాజప్ప, ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోలీసు వ్యవస్థవల్ల ప్రతిఒక్కరూ క్షేమంగా, భద్రంగా ఉండగలుగుతున్నారన్నారు. వారి సేవలు, త్యాగాలు ఎనలేనివని కొనియాడారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ.. 24 గంటలూ ప్రజాసేవకే జీవితం అంకితం చేస్తున్న పోలీసుల సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఎస్బీ డీఎస్పీ కేవీవీ సత్యనారాయణ, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, పలువురు సీఐలు, ఎస్ఐలు, అమరవీరుల కుటుంబసభ్యులు, కానిస్టేబుళ్లు అమరవీరుల స్థూపం వద్ద పూలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ పోలీసు కార్యాలయంనుంచి భానుగుడి కూడలి వరకు నిర్వహించిన ర్యాలీని కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధులు జెండా ఊపి ప్రారంభించారు.

నేడు గండేపల్లిలో ధాన్యం కొనుగోలు ప్రారంభం

- కలెక్టర్‌తోపాటు పాల్గొననున్న ఎమ్మెల్యే జ్యోతుల, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్,
- జిల్లావ్యాప్తంగా మొత్తం 269 కేంద్రాలు
- 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు సంసిద్ధం

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి బుధవారం నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నారు. తొలుత వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్న గండేపల్లిలో ప్రారంభించనున్నారు. బుధవారం కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్, స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, పౌరసరఫరాల సంస్థ ఏపీ చైర్మన్ తోట సుధీర్, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ దేవుల నాయక్, వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి సత్యనారాయణరాజు పాల్గొననున్నారు. గండేపల్లి మండలంలో కేంద్రాలు ప్రారంభమైన తర్వాత జిల్లావ్యాప్తంగా ప్రారంభమవుతాయి. జిల్లాలో 269 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. దీని ద్వారా మూడులక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.2320 చొప్పున కనీస మద్దతు ధర ప్రకటించింది. ఈ నేపథ్యంలో రైతులు రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. రైతులు ధాన్యం విక్రయించిన తర్వాత 24 గంటల నుంచి 48గంటల్లో వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ధాన్యం విక్రయించిన తర్వాత నెలల తరబడి సొమ్ములు జమకాకపోవడంవల్ల రైతులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ధాన్యం విక్రయించిన రైతును వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో పంటల పెట్టుబడి కోసం ప్రైవేటుగా అధిక వడ్డీలకు అప్పులకు తెచ్చే దుస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ధాన్యం సేకరణపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించింది. రైతుకు 48గంటలలోపే ధాన్యం సొమ్ములు జమ చేసేలా చర్యలు తీసుకుంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గత ఖరీఫ్‌లో విజయవంతంగా..

కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో గత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ విజయవంతంగా నిర్వహించారు. ఖరీఫ్‌కు సంబంధించి సొమ్ములు కూడా రైతులకు జమచేశారు. గతేడాది ఖరీఫ్‌లో 1.60లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. రూ.150కోట్ల బ్యాంకు గ్యారెంటీలను మిల్లర్ల నుంచి తీసుకున్నారు.

అక్రమాలకు తావులేకుండా..

దళారులు, కమీషన్ ఏజెంట్లవల్ల అక్రమాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. రైతు సేవా కేంద్రాలవద్ద ఏ రైతు పేరుమీద ఈ-క్రాప్ బుకింగ్ అయిందో, అదే రైతు ధాన్యాన్ని విక్రయించి కొనుగోలు కేంద్రంలోనే ఈకేవైసీ నమోదు చే సుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. దీం తో అసలైన రైతుకే ప్రభుత్వం ఇస్తున్న కనీస మద్దతు ధర లభించేలా అధికారులు సర్వం సిద్ధం చేశారు.

కాకినాడ అభివృద్ధికి ప్రణాళిక రూపకల్పన

- వచ్చేనెల 25 నాటికి ఖాళీ స్థలాలకు నూరుశాతం పన్నులు చెల్లించాలి: కలెక్టర్

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగర సమగ్ర అభివృద్ధి, ఆర్థిక సుస్థిరత, పౌర సౌకర్యాల మెరుగుదల లక్ష్యంగా నగరాన్ని ఆర్థిక వనరులను బలోపేతం చేయడంతోపాటు పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కాకినాడ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, కలెక్టర్ షాన్ మోహన్ అన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో కలిసి ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణానికి అనుకూలమైన అన్ని వనరులు ఉన్న కాకినాడ పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తా మన్నారు. కాకినాడ నగర సమగ్ర అభివృద్ధి, ఆర్థిక సుస్థిరత, పౌర సౌకర్యాలు మెరుగుదల లక్ష్యంగా నగరాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇందుకు కాకినాడ నగరంలోకి వివిధ మార్గాల ద్వారా ఆదాయ వనరులు సమకూర్చుకోవడానికి రాష్ట్రంలో ఆదర్శమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు అవసరమయ్యే చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగా రానున్న 3నెలల్లో కొన్ని మార్పులు తీసుకురావడంపై దృష్టిపెట్టామన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో 2015-16 తర్వాత ఇంతవరకు పన్నుల హేతుబద్ధీకరణ చేపట్టలేదని, త్వరలో మార్పులు తీసుకువస్తామన్నారు. చాలా ఖాళీ స్థలాల యజమానులు పన్ను చెల్లించడం లేదని, వీటికి వచ్చేనెల 25 నాటికి నూరుశాతం పన్నులు చెల్లించాలని కోరారు. ఖాళీ స్థలాలకు పన్ను చెల్లించని వాటికి నిబంధనల ప్రకారం ప్రభుత్వం స్వాధీనం చేసుకుని 22(ఎ) జాబితాలో చేరుస్తామన్నారు. నగరంలోని పార్కులను వ్యాపార, పారిశ్రామిక, స్వచ్ఛంద సంస్థలు భాగ్యస్వామ్యంతో అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సామాజిక బాధ్యత కింద 9పార్కులను దత్తత ఇస్తామన్నారు. అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ పాల్గొన్నారు.

'పెట్రోలులో నీళ్లు'

- ఓ వాహనదారుడి ఆరోపణ
- అదంతా ఫేక్: డీఎస్‌వో



బంకులో పెట్రోల్ నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

కాకినాడ,అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ భానుగుడి సమీపంలోని ఓ కంపెనీ పెట్రోల్ బంక్ వద్ద సోమవారం కొంతమంది యువకులు ఆందోళన చేపట్టారు. తమ వాహనంలో పోయించిన పెట్రోలులో నీరులాంటి ద్రవపదార్థం చేరిందంటూ ఆరోపించారు. సోమవారం బైక్‌పై వచ్చిన యువకుడు రూ.150 విలువైన పెట్రోల్ కొట్టించుకున్నాడు. కొంతదూరం వెళ్లాక బండి ఆగిపోయింది. తీరా పరిశీలించాక.. ఆ పెట్రోల్‌లో వాటర్ లాంటి లిక్విడ్ కలిసినట్టుగా గుర్తించారు. దీనిపై బంక్ నిర్వాహకులను ప్రశ్నించగా ఇది కంపెనీ బంకు అని.. ఇక్కడ మీకు ఎవరూ సమాధానం చెప్పరంటూ అక్కడి సిబ్బంది చెప్పడంతో ఆ యువకుడు, అతడితో మరికొందరు కలిసి ఆందోళనకు దిగారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

యువకుడిపై ఫిర్యాదు చేస్తాం: డీఎస్‌వో

బాధితుడు ఆధారాలతో సహా పెట్రోలు పోయడాన్ని నేరుగా చూపిస్తూ వీడియోను వాట్సాప్, సోషల్ మీడియాలో పోస్టు చేసినా అధికారులు వాటిని ఫేక్ అని తేల్చేశారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సత్యనారాయణ రాజు, జిల్లా తూనికలు కొలతలశాఖ అధికారి సలీమ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న బంకులో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. అక్కడ ఏమీ జరగలేదని తేల్చారు. ఇదంతా సోషల్ మీడియాలో వ్యూస్ కోసం ఓ యువకుడు చేసిన రగడ అని తెలిపారు. తాము ఫోన్ చేస్తున్నా.. అతడు ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని డీఎస్‌వో వివరించారు. ఇది ప్రభుత్వ బంక్ అని, ఇక్కడ ఏ పొరపాట్లు జరగబోవని సర్దిపైచేశారు. సోషల్‌మీడియాలో బంక్‌పై ఆరోపణలు చేస్తూ పోస్టు పెట్టిన యువకుడిపై సైబర్ క్రైంకు ఫిర్యాదు చేయనున్నట్టు వెల్లడించారు.

పట్టణాలుగా.. పల్లెలు!



- గ్రామాలకు కొత్త రూపురేఖలు
- పంచాయతీలో సంస్కరణలు
- 4 గ్రేడ్లుగా పంచాయతీల విభజన
- కార్యదర్శులకు పదోన్నతులు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామీణ పాలనలో విప్లవాత్మక మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పంచాయతీల పునఃవర్గీకరణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాటు పంచాయతీరాజ్‌శాఖ ఉద్యోగులకు దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఉద్యోగోన్నతి పర్వానికి తెరలేపింది. మంత్రివర్గం ఆమోదం తెలిపిన పది రకాల సంస్కరణల్లో భాగంగా పంచాయతీలను నాలుగు గ్రేడ్లుగా(స్పెషల్ గ్రేడ్, గ్రేడ్ 1, గ్రేడ్ 2, గ్రేడ్ 3) విభజించి, ఉద్యోగుల ప్రమోషన్లకు మార్గం సుగమం చేశారు. దీనిలో భాగంగా ప్రస్తుతం జిల్లా పరిషత్, జిల్లా పంచాయతీ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్లు, గ్రేడ్ వన్ పంచాయతీ కార్యదర్శులకు జోన్(ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి పశ్చిమగోదావరి, ఉమ్మడి కృష్ణా) జిల్లాల్లో 150మందికి కొత్తగా ఏర్పడిన గ్రేడుల్లో డిప్యూటీ ఎంపీడీవో, జీఎస్‌డబ్ల్యుఎస్ పోస్టులకు ఉద్యోగున్నతులు ఇవ్వడానికి రంగం సిద్ధమవుతోంది. అనంతరం మిగిలిన పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం తదుపరి ఉత్తర్వుల ఆదేశాల మేరకు పదోన్నతులు ఇవ్వనున్నారు. ఇప్పటివరకు పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన వారు ఇకపై పంచాయతీ అభివృద్ధి అధికారులుగా(పీడీవో) బాధ్యతలు నిర్వర్తించనున్నారు. పట్టణాలు, మునిసిపాలిటీల తరహాలో గ్రామ పంచాయతీల్లో కూడా ప్రణాళిక, ఇంజనీరింగ్, రెవెన్యూ, తాగునీరు, వీధిలైట్లు, పారిశుధ్య వంటి విభాగాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1102 పంచాయతీలు, 1271 సచివాలయాలు, అలాగే జోన్(ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి పశ్చిమగోదావరి, ఉమ్మడి కృష్ణ) జిల్లాలో 150 పంచాయతీరాజ్, జిల్లా పంచాయతీ ఉద్యోగులు ఈ పునఃవర్గీకరణలో భాగమవుతున్నారు.

జనాభా-ఆదాయమే ప్రమాణం

స్పెషల్ గ్రేడ్(రూఅర్బన్) : ప్రభుత్వం నిర్ణయించిన కొత్త రేఖాచిత్రం ప్రకారం మైదాన ప్రాంతాల్లో 10 వేల మందికిపైగా జనాభా లేదా ఆదాయం కోటి రూపాయలు ఉన్న గ్రామాలు స్పెషల్ గ్రేడ్‌గా, ఏజెన్సీ ప్రాం తాల్లో ఐదువేల మందికి పైగా జనాభా ఉన్న పంచాయతీలు స్పెషల్ గ్రేడ్ కింద పరిగణించనున్నారు.జనాభా, వార్షిక ఆదాయాలను ఆధారంగా చేసుకుని మిగతా పంచాయతీలను మూడు గ్రేడ్‌లుగా వర్గీకరించనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో 1102 పంచాయతీలకుగాను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలు 76, గ్రేడ్ 1 పంచాయతీలు 273, గ్రేడ్ 2 పంచాయతీలు 427, గ్రేడ్ పంచాయతీలు 326. గ్రేడ్ 1: జనాభా 4వేల నుంచి 10వేల మధ్యలో ఉండాలి. రూ.50లక్షల నుంచి రూ.కోటి ఆదాయం కలిగి ఉండాలి. గ్రేడ్ 2: జనాభా 2వేల నుంచి 4 వేలు, ఆదాయ పరిమితి లేదు. గ్రేడ్ 3: జనాభా 2 వేల కంటే తక్కువ గల గ్రామాలు.

సుస్థిరపాలన కోసమే..



పట్టణాల తరహాలో పల్లెలను అభివృద్ధి చేసే లా కొత్త వ్యవస్థను ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన సంస్కరణలు గ్రామాల్లో సుస్థిర అభివృద్ధికి, సుపరిపాలనకు ఎంతగానో దోహదపడతాయి.

-వి.రవికుమార్, డీపీవో, కాకినాడ జిల్లా

కౌడా చైర్మన్ తుమ్మల రాజీనామా ఆమోదం

- ఈనెల 8న రాజీనామా
- డీసీసీబీ చైర్మన్‌గా కొనసాగనున్న బాబు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(కౌడా) చైర్మన్ తుమ్మల రామస్వామి రాజీనామాకు ఆమోదం లభించింది. డీసీసీబీ చైర్మన్‌తోపాటు మరో నాలుగు పదవులు ఉండడంతో ఇతర పార్టీలతోపాటు సొంతపార్టీ నుంచి కూడా విమర్శలు రావడంతో ఈనెల 8న ఆయన కౌడా చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. దీంతో రాజీనామాను ఆమోదిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ సురేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జనసేన పార్టీ నేత తుమ్మల బాబు తనకు డీసీసీబీ చైర్మన్ పదవి దక్కడంతో కౌడా చైర్మన్ పదవికి మేలో రాజీనామాచేశారు. అయినా ఆమోదించకుండా ఇంతకాలం ఆయన్నే ఆ కొనసాగిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. దీనికితోడు యూడీఏ చైర్‌పర్సన్‌ల పదవీకాలాన్నీ వారు నియామకమైన తేదీ నుంచి ఒకపేడాది నుంచి రెండేళ్లకు సవరిస్తూ సెప్టెంబరు 29న జీవో ఆర్టీ నెంబర్ 1076ను ప్రభుత్వం విడుదల చేసింది. అప్పటికే డీసీసీబీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టడంతో కౌడా చైర్మన్ కుర్చీ వ్యవహారంపై అన్ని వైపుల నుంచి విమర్శలు మొదలయ్యాయి.కౌడా చైర్మన్ కుర్చీ వ్యవహారం ఎటూ తేల్చకపోవడంతో ఈ పదవికోసం జనసేనతోపాటు టీడీపీనుంచి ఆశావహులు ప్రయత్నిస్తున్నారు.

కార్తీకం.. సత్యదేవుడి సన్నిధి సిద్ధం!

- భక్తులకు ఏర్పాట్లు పూర్తి
- ఈ నెలలో సుమారు 20 లక్షల మంది విచ్చేస్తారని అంచనా
- 1.50 లక్షల వ్రతాలు జరిగే అవకాశం


దాత నిర్మించిన భారీ విశ్రాంత షెడ్డు
పశ్చిమ రాజగోపురం వద్ద వ్రత భక్తుల కోసం ఏర్పాటు చేసిన హోల్డింగ్ పాయింటు

అన్నవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హరిహరులకు ఎంతో ప్రీతికరమైనది కార్తీకమాసం. ఈ కార్తీకంలో హరిహరక్షేత్రంగా విరాజిల్లుతున్న కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధికి ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి సుమారు 20 లక్షలమంది తరలివస్తారని అంచనాతో దానికణుగుణంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే వివిధ శాఖలు సమన్వయంతో పలు లక్ష్యాలను నిర్దేశించుకోగా వాటిని ఆచరణలోకి తీసుకొచ్చారు. పర్వదినాల్లో ఒంటిగంట నుంచి వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభించాలని నిర్ణయించారు. పశ్చిమ రాజగోపురం వద్ద ఎటువంటి తోపులాటలకు ఆస్కారం లేకుండా వాటర్‌ప్రూఫ్ షెడ్డు వేసి హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. లోపల వ్రత మండపాలు ఖాళీ అయితేనే హోల్డింగ్ పాయింట్ నుంచి భక్తులు లోపలకి చేరతారు. వాహనాలు అన్నింటికీ వన్‌వే మార్గం ఏర్పాటుచేశారు. పశ్చిమ రాజగోపురం ఎదురుగా సుమారు రూ.2.50 కోట్లతో ఫార్మాషూటికల్ సంస్థ సహకారంతో భారీ షెడ్డును వినియోగంలోకి తీసుకొచ్చారు. దీనిలో వ్రతం, దర్శనం, ప్రసాదం టిక్కెట్లు విక్రయాలు జరుపుతారు. అదేవిధంగా భక్తులు వేచిఉండేవిధంగా ఏర్పాట్లు చేశారు. ఎక్కడికక్కడ పోలీస్ బందోబస్తు, వాకీటాకీల ద్వారా పర్యవేక్షణ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఎప్పటికప్పుడు కమాండ్ కంట్రోల్‌రూం ద్వారా అధికారులు, సిబ్బందికి సూచనలు చేసేలా యంత్రాంగాన్ని సిద్ధం చేశారు. వివిధ వాహనాల్లో విచ్చేసే భక్తులకు పార్కింగ్ సత్యగిరికి తరలించి అక్కడినుంచి దేవస్థానం ఉచిత వాహనాల్లో స్వామి సన్నిధికి చేర్చుతారు. నవంబరు 2న స్వామివారి తెప్పోత్సవం సాయంత్రం 5.30కి ప్రత్యేకపూజలతో ప్రారంభమై రాత్రి 7.30కి పంపా సరోవరంలో నౌకావిహారం జరుపుతారు. ప్రధానంగా కార్తీకపౌర్ణమి రోజున జరిగే గిరిప్రదక్షిణకు సుమారు 2 లక్షల మంది విచ్చేయనుండగా.. ఉదయం 8 గంటలకు తొలి పావంచా వద్ద నుంచి స్వామి,అమ్మవార్లను పల్లకీలో మధ్యాహ్నం 2గంటల నుంచి సత్యరథంపై గిరియాత్ర నిర్వహిస్తారు. భక్తులు సత్యరథం ద్వారా గిరియాత్ర చేపట్టాలని అధికారులు కోరారు.

వాహనదారులు నిబంధనలు పాటించడం తప్పనిసరి


ఆటో, బస్సు, ఇతర వాహనాల డ్రైవర్లతో సమావేశంలో పాల్గొన్న అన్నవరం దేవస్థానం ఈవో, ఎస్‌ఐ

అన్నవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని వేలాదిగా రోడ్డు, రైలు మార్గాల్లో అన్నవరం విచ్చేసిన భక్తులను కొండపైకి తీసుకెళ్లే ఆటో, బస్సు, ఇతర ప్రయివేట్ వాహనదారులతో సోమవారం అన్నవరం ఎస్‌ఐ హరిబాబు, దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. ప్రధానంగా లైసెన్స్, ఇతర డాక్యుమెంట్లను కలిగి ఉండాలని, యూనిఫాం ధరించి, అతివేగంగా వాహనాలు నడపకుండా ఉండాలన్నారు. నిర్ణయించిన పాసింజర్ల కంటే ఎక్కువమందిని ఆటోలో ఎక్కించకుండా వారిపై గౌరవంగా మాట్లాడడం, ఎవరైనా తమ లగేజీని ఆటోలో మరిచిపోయిన ఎడల వారికి బాధ్యతగా అప్పగించడం, సంబంధిత విషయాన్ని పోలీసులకు తెలియపరచడం చేయాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడకుండా, నిర్దేశిత ప్రదేశాల్లో పార్కింగ్ చేయాలన్నారు. రాంగ్‌రూట్‌లో ప్రయాణాలు నిషిద్ధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో దేవస్థానం ట్రాన్స్‌పోర్టు అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురు ప్రత్యేకాధికారుల నియామకం

అన్నవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా సత్యదేవుడి సన్నిధికి లక్షలాదిగా విచ్చేసే భక్తుల రద్దీ నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్య చర్యల్లో భాగంగా దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ ముగ్గురు దేవదాయశాఖ అధికారులను డిప్యూటేషన్‌లో ప్రత్యేకంగా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ కమిషనర్ రమేష్ బాబు, వాడపల్లి దేవస్థానం ఈవో ఎన్.చక్రధరరావు, లోవ దేవస్థానం ఈవో విశ్వనాధరాజును నియమించారు. కార్తీకమాసంలో 4 శని,ఆది,సోమవారాలు.. 2 దశమి, ఏకాదశిలు, కార్తీకపౌర్ణమి గిరిప్రదక్షిణ, తెప్పోత్సవం వంటి ముఖ్యమైన రోజు ల్లో విపరీతమైన రద్దీ ఉంటుంది. నిర్దేశించిన రోజుల్లో వీరంతా అన్నవరంలో ఉండి భక్తుల కోసం క్యూలైన్లు, వ్రతాల నిర్వహణ, మౌలిక వసతులు పర్యవేక్షణ చేయనున్నారు.

సత్యదేవుడికి హైకోర్టు న్యాయమూర్తి పూజలు


హైకోర్టు న్యాయమూర్తికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

అన్నవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఈవో వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

బాణసంచా పేలుడులో మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున పరిహారం

అనపర్తి, మండపేట ఎమ్మెల్యేలు రామకృష్ణారెడ్డి, జోగేశ్వరరావు వెల్లడి


అనపర్తిలో వివరాలను వెల్లడిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి/మండపేట/రాయవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వి.సావరం, తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెం సరిహద్దుల్లోని లక్ష్మీ గణపతి ఫైర్ వర్క్స్‌లో ఈ నెల 8న జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియాను సీఎం చంద్రబాబు మంగళవారం ప్రకటించారని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. అనపర్తిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే తాను మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొనడంతో పాటు ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ ఘటనకు సంబంధించి ప్రభుత్వం ద్విసభ్య కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. అయితే కర్నూలులో ప్రధాని పర్యటన నేపథ్యంలో కమిటీ విచారణ కొంత ఆలస్యం అయినప్పటికీ మంగళవారం నివేదిక అందిన వెంటనే ముఖ్యమంత్రి పరిహారం ప్రకటించారన్నారు. ఈ ప్రమాదంలో యజమాని సహా పదిమంది మృతిచెందారని, బాధిత కుటుంబాలకు సరైన పరిహారం అందించేందుకు ముఖ్యమంత్రిని ఒప్పించడంలో మంత్రులు సుభాష్, అనిత, ఎమ్మెల్యే జోగేశ్వరరావు తనతో పాటు కృషి చేశారని పేర్కొన్నారు. కార్మిక శాఖ నుంచి ఈ పరిహారం త్వరలోనే బాధిత కుటుంబాలకు అందజేస్తామని, అలాగే యజమాని తరపున కూడా పరిహారం అందే విధంగా కృషి చేస్తామన్నారు. పది మంది మృతుల్లో అనపర్తి నియోజకవర్గానికి చెందిన వారు ఏడుగురు ఉన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండపేటలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ రెండురోజుల్లో మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతులమీదుగా బాధితులకు ఆర్థికసాయం అందజేస్తామని తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతి

పిఠాపురంలో మృతురాలి తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన


పిఠాపురం ప్రభుత్వాసుపత్రి వద్ద శిశువుతో బంధువులు

పిఠాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే బాలింత మృతి చెందిందని, శిశువును చిదిమేశారని మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు ఆరోపించారు. వారు మంగళవారం ప్రభుత్వాసుపత్రికి చేరుకుని ఆందోళనకు దిగారు. అనంతరం పాడా పీడీకి ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన దొండపాటి శ్రీదుర్గ (25) ఈనెల 13న డెలివరీ కోసం ప్రభుత్వాసుపత్రిలో చేరింది. 14న డెలివరీ కాగా తల్లి, బిడ్డల పరిస్థితి సీరియస్‌గా మారడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పంపగా అక్కడ చికిత్స పొందుతూ శ్రీదుర్గ మరణించింది. శిశువును డెలివరీ సమయంలో చిదిమివేయడంతో ఒక వైపు చేయి పనిచేయకపోవడంతో పాటు కంటి పై గాయమైంది. హైరిస్క్ పేషేంటుగా ఉన్న శ్రీదుర్గకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా బలవంతంగా నార్మల్ డెలివరీ చేయడం వల్లే మరణించిందని మృతురాలి తల్లిదండ్రులు దొండపాటి రాజు, సుబ్బారావు ఆరోపించారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తల్లిదండ్రులు, వారి బంధువులు ప్రభుత్వాసుత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. హైరిస్క్ కేసు అని గుర్తించినా ఎందుకు జాగ్రత్తలు తీసుకోలేదని నిలదీశారు. వారికి గొల్లప్రోలు జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు సంఘీభావం తెలిపారు. వారి ఆందోళనతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పిఠాపురం పట్టణ ఎస్‌ఐ మణికుమార్, పోలీసులు వచ్చి ఆందోళనకారులతో చర్చించారు. మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు, జడ్పీటీసీ లోవరాజు పిఠాపురం పాడా కార్యాలయానికి చేరుకుని ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణికి ఫిర్యాదు చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పీడీ హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

రైల్వే పట్టాలపైకి వరదనీరు... రైల్వే అధికారుల సమీక్ష

పుంత రహదారులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల కారణంగానే ముంపు అని గుర్తింపు


సామర్లకోట ఎఫ్‌సీఐ గోదాముల వద్ద పుంత రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

సామర్లకోట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైలు పట్టాలపైకి ఆదివారం పెద్దఎత్తున వరదనీరు చేరిక, పలు రైళ్ల రాకపోకలకు సుమారు 16 గంటల పాటు అంతరాయం వంటి సంఘటనలను రైల్వే ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ విషయంపై సోమవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై రైల్వే ఉన్నతాధికారులు సమీక్షించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని అధ్యయనం చేయాలని ఆదేశించడంతో రైల్వే ఏఈఎన్ ప్రభాకర్, అధికారులు, సిబ్బంది మంగళవారం సత్యనారాయణపురం శివారు వీర్రాజునగర్, ఎఫ్‌సీఐ గోదాములు, మట్టలవారి చెరువు, ఏడీబీ రోడ్డు వంటి ప్రాంతాలను పరిశీలించి పట్టణ ఎగువ ప్రాంతాల్లో గరువులలో కురిసిన వర్షం నీరు రాకకు పూర్వం నుంచీ ఉన్న పుంతమార్గాలు, చెరువులకు ఉన్న స్లూయిజ్‌ల మార్గాలను, రైల్వే కాలువల నుంచి మున్సిపల్ డ్రైన్‌లోకి సత్యనారాయణపురం ఫ్లయ్‌ఓవర్‌బ్రిడ్జి పక్కనుంచి ఉన్న ప్రధాన డ్రైనులను పరిశీలించారు. పుంత రహదారులు పూర్తిగా ఆక్రమణలకు గురైనట్టు గుర్తించారు. అలాగే ఏడీబీ రోడ్డు మీదుగా రాక్ సిరామిక్ సమీపం నుంచి ఎఫ్‌సీఐ గోదాములు పక్క నుంచి రైల్వే తూముల మీదుగా పూర్వం నుంచి ఉన్న పుంత రహదారిని పూర్తిగా ఆక్రమించడం వల్ల ఎగువ ప్రాంతాల్లో వరదనీరు ఆ తూములమీదుగా కాకుండా రైలు పట్టాలపైకి చేరుతున్నందునే ముంపు సమస్య ఎదుర్కొంటున్నట్టు ప్రాథమికంగా గుర్తించి నివేదికలు రూపొందించారు. సత్యనారాయణపురం శివారున రైల్వే గోతులు ఆక్రమణలకు గురై పెద్దపెద్ద భవనాలు నిర్మించినట్టు క్షేత్రస్థాయిలో గుర్తించారు. ఆక్రమణలను గుర్తించేందుకు శాశ్వత ప్రాతిపదికన, భవిష్యత్తులో రైలు పట్టాల పైకి వరదనీరు చేరకుండా ఉండేందుకు రక్షణ చర్యలు చేపట్టేందుకు రైల్వే, మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని స్థానిక అధికారుల బృందం నిర్ణయించి రైల్వే ఉన్నతాధికారుల అనుమతుల కోసం నివేదికలు పంపారు.

కాకినాడలో మహిళ అనుమానాస్పద మృతి


లక్ష్మి మృతదేహం

కాకినాడ క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో మంగళవారం ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. కర్నాటక రాష్ట్రానికి చెందిన కేవీఎస్ వెంకటేష్ స్థానిక ఎస్‌ఆర్‌కే బిల్డింగ్‌లో బేకరీ నిర్వహిస్తున్నాడు. ఇదే భవనం పై అంతస్తులో బేకరీకి సంబంధించిన కార్ఖానా ఉంది. ఇందులో స్థానిక బాలాజీచెరువు సెంటర్‌కు చెందిన ర్యాలీ లక్ష్మి (40) 2 నెలలుగా పనిచేస్తోంది. అయితే మంగళవారం సాయంత్రం యజమాని బేకరీలో బేరం చూస్తుండగా పై అంతస్తులోని ఖార్కానాలో ఉన్న లక్ష్మి అచేతనంగా పడిఉంది. ఈ విషయాన్ని ఆ పక్కనే ఉన్న దుకాణం యాజమాని గుర్తించి బేకరీ యాజమానికి సమాచారం ఇవ్వగా వెంకటేష్ వచ్చి లక్ష్మి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. అనంతరం పోలీసులకు తెలిపాడు. ఆటోలో లక్ష్మిని జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. లక్ష్మి భర్త నుంచి వేరుపడి ఉందని, ఆమెకు పదేళ్ల కుమార్తె ఉందని బంధువులు తెలిపారు. ఈ మేరకు కాకినా డ త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టుకు ఉరేసుకున్న వ్యక్తి


పంకజ్ (ఫైల్‌ఫొటో)

తుని రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చెట్టుకు వ్యక్తి ఉరేసుకుని మృతిచెందిన ఘటన కాకినాడ జిల్లా తుని పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. తుని ఎస్‌ఐ విజయ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. అస్సాం రాష్ట్రానికి చెందిన పంకజ్ 20 రోజులుగా మతిస్థిమితం లేకుండా తుని రైల్వే స్టేషన్ పరిధిలో తిరుగుతున్నాడు. తుని రైల్వే స్టేషన్ శివారు తాళ్ళూరు రైల్వేగేటు సమీపంలో ఓ చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు.

కారు ఢీకొని తండ్రీకొడుకులకు గాయాలు

ముమ్మిడివరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం కాశివాని తూము బైపాస్ సెంటర్‌లో మోటారుసైకిల్‌పై రోడ్డును దాటుతుండగా ఓ కారు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో మోటారుసైకిల్‌పై ఉన్న తండ్రీ కొడుకులు గాయపడ్డారు. 2016 జాతీయ రహదారి కాశివానితూము బైపాస్ సెంటర్‌లో మంగళవారం ఈ ప్రమాదం జరిగింది. మోటారు సైకిల్‌పై వెళుతున్న ముమ్మిడివరం మండలం గురజాపులంకకు చెందిన యడ్ల సుభాష్‌బాబు, యడ్ల అర్జున్‌కుమార్ గాయపడ్డారు. ఈ ఘటనలో తండ్రి తీవ్రంగా గాయపడగా కుమారుడు స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడిని వారిని అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

తండ్రవుతాడనుకుంటే తనువు చాలించే..

మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో యువకుడి మృతి

అతడి భార్య 9 నెలల గర్భిణి


లోవరాజు (ఫైల్)


బోరున విలపిస్తున్న లోవరాజు భార్య, తల్లి, అక్క, బంధువులు

కపిలేశ్వరపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం శివారు కొండాలమ్మ ఆలయ సమీపంలో సోమవారం రాత్రి ఎదురెదురుగా రెండు మోటారుసైకిళ్లు ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. అతడి భార్య 9 నెలల గర్భిణి కావడంతో ఆ కుటుంబం బోరున విలపిస్తుంది. మంగళవారం అంగర పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కపిలేశ్వరపురం గ్రామశివారు సత్యనారాయణపురానికి చెందిన కముజు లోవరాజు(33) మోటారు సైకిల్‌పై అంగర వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ బలంగా ఢీకొంది. లోవరాజు తలకు తీవ్రగాయం కావడంతో మృతిచెందాడు. మరో బైక్‌పై ఉన్న కాట్రేనికోన మండలం దొంతుకుర్రుకి చెందిన కాలేటి బాలయోగి, గెడ్డం నాగార్జునుకు గాయాలు కావడంతో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. లోవరాజు 104 వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడి సోదరుడు కముజు వీరవెంకటసత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్‌ఐ హరీష్‌కుమార్ పేర్కొన్నారు. లోవరాజు భార్య దుర్గ నీలిమ 9నెలల గర్భిణి, ఆసుపత్రిలో చేయాల్సి ఉండగా ఇంతలోనే ఇలా జరగడం పట్ల కుటుంబీకులు, బంధువులు జీర్ణించుకోలేక బోరున విలపిస్తున్నారు. లోవరాజు చిన్నవయసులోనే మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

యువకుడిపై పోక్సో కేసు

రాజమహేంద్రవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బాలికను అత్యాచారం చేసిన యువకుడిపై తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం టూటౌన్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ శివగణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లాకు చెందిన ఓ బాలిక (16) రాజమహేంద్రవరంలోని ఓ వసతి గృహంలో ఉంటూ పదో తరగతి చదువుతోంది. దీపావళి రోజున జొన్నాడకు చెందిన అజయ్ అనే యువకుడు తనకు మాయ మాటలు చెప్పి బలవంతంగా ఓ లాడ్జికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నామని పేర్కొన్నారు.

క్రీడా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందించే అత్యున్నత క్రీడా పురస్కారాలైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న, అర్జున, ద్రోణాచార్య అవార్డులతోపాటు రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారాలు-2026కు సంబంధించి అర్హులైన క్రీడాకారులు, కోచ్‌లు, సంస్థలు దరఖాస్తులు అందజేయాలని తూర్పుగోదావరి జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 28లోపు కేంద్ర ప్రభుత్వ క్రీడా శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సామర్లకోటలో బాలుడిపై కానిస్టేబుల్ దాడి

దళిత సంఘాల ఆందోళన


సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న దళిత సంఘాలు

సామర్లకోట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట బ్రౌన్‌పేటలో దీపావళి వేడుకల్లో తారాజువ్వలను నేలబారున విడుస్తున్నారన్న ఫిర్యాదులతో సోమవారం రాత్రి 10 గంటలకు దడాల అక్షయ్‌కుమార్ అనే దళిత బాలుడిపై పోలీసు కానిస్టేబుల్ సతీష్ దాడి చేయడంతో అపస్మారకస్థితికి చేరి ఆసుపత్రి పాలయ్యాడని దళిత సంఘాలు ఆందోళనకు దిగాయి. పోలీసుల వైఖరిని నిరసిస్తూ ప్రభుత్వాసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. అక్షయ్‌కుమార్‌కు ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించి ఉన్నత చికిత్స నిమిత్తం కాకినాడ లో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి బానే ఉన్నట్టు ఆసుపత్రి వర్గాలు వెల్లడించడంతో దళితసంఘాలు ఆందోళనలు విరమించారు. సతీష్‌పై కేసు నమోదు చేయాలని, బాధితుడికి ఆర్థిక సాయం అందించాలనే డిమాండ్లపై పోలీసులు చర్చలు జరిపారు. సతీష్ లాఠీతో కొట్టడం వల్ల అక్షయ్ ఫిట్స్ వచ్చి పడిపోయాడని ఆందోళనకారులు ఆరోపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు సామర్లకోట పోలీసులు పోలీసులు తెలిపారు.

దాడి చేయలేదు : డీఎస్పీ

సామర్లకోటలో బాలుడిపై పోలీసులు ఎవ్వరూ దాడి చేసి గాయపర్చలేదని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు వెల్లడించారు. దళిత యువకుడు అక్షయ్‌కుమార్‌నే కాదు మర్వెరినీ పోలీసులు కొట్టలేదని డీఎస్పీ శ్రీహరిరాజు ఖండించారు. మంగళవారం రాత్రి ఈ మేరకు సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ శ్రీహరిరాజుతో బాటు సీఐ కృష్ణభగవాన్ కూడా పాల్గొన్నారు.

చిన్నింపేటలో పొల్యూషన్ బోర్డు కమిటీ తనిఖీలు


చిన్నింపేట సీపీఎఫ్ పరిశ్రమ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

ఏలేశ్వరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం చిన్నింపేట గ్రామంలో ఉన్న సీపీఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కర్మాగారంలో మంగళవారం జాతీయ పొల్యూషన్ బోర్డు కమిటీ సభ్యులు తనిఖీలు చేశారు. పరిశ్రమ నుంచి విడుదలయ్యే వ్యర్థాలు, శుద్ధి చేయని వ్యర్థ జలాలు చుట్టుపక్కల ఉన్న పొలాలకు కలుషిత నీరు చేరడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని గ్రామానికి పిల్లి చంద్రరావు ఫిర్యాదు చేశాడు. జాయింట్ కమిటీ సభ్యులు తనిఖీలకు హాజరై పరిశ్రమ నుంచి పొలాల్లో విడుదలయ్యే వ్యర్థాలు, నీటిని పరిశ్రమ పరిధిలో పరిశీలించారు. ఈ వివరాలు చెప్పేందుకు కమిటీ సభ్యులు నిరాకరించారు.

ఇసుక లారీలను నియంత్రించాలి

కన్నాయిగూడెం వాసుల ఆందోళన

కదిలిన అధికారులు, ఎమ్మెల్యే తెల్లం


ఇసుక లారీలు నిలిపి ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఎటపాక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఇసుక లారీలు నియంత్రించాలని, డ్రైవర్లు నిర్లక్ష్యంగా ప్రమాదకర రీతిలో లారీలు నడుపుతున్నారని..వాటి రాకపోకలతో రహదారులు ధ్వంసవుతున్నాయని కన్నాయిగూడెం వాసులు ఆందోళనబాట పట్టారు. అల్లూరి జిల్లా ఎటపాక మండలం రాష్ట్ర సరిహద్దులోని కన్నాయిగూడెం వద్ద గ్రామస్తులు భద్రాచలం- చర్ల అంతరాష్ట్ర రహదారిపై 2 రోజుల పాటు ఇసుక లారీలను అడ్డుకున్నారు. దీంతో సరిహద్దులోని 2రాష్ట్రాల పరిధిలోని పోలీసులు, రెవెన్యూతోపాటు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కదిలారు. ఆయన మాట్లాడుతూ భద్రాచలం నుంచి చర్ల వరకు చేపట్టే రహదారి మరమ్మతుల పనుల్లో భాగంగా మధ్యలో తమ పరిధి (ఆంధ్ర)లో ఉన్న ఎటపాక నుంచి కన్నాయిగూడెం వరకు కూడా రహదారి మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. మరమ్మతులు పూర్తయ్యేవరకు ఇసుక రావాణా చేయవద్దని తెలంగాణలోని చర్ల, భద్రాచలం మండలాల తహశీల్దార్లను ఆదేశించారు. మరోవైపు చింతూరు పీవో శుభం నోక్వాల్ సైతం స్పందించారు. కన్నాయిగూడెం వాసులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆంధ్ర పరిధి వరకు రహదారి మరమ్మతులు చేస్తామని హామీఇచ్చారు. ఆందోళనలతో సుమారు 10 కిలోమీటర్ల మేర ఇసుక లారీలు నిలిచిపోయాయి. తెలంగాణలోని దుమ్ముగూడెం మండలానికి చెందిన కొందరు ఇసుక లోడ్ లారీలను కన్నాయిగూడెంలో గ్రామస్తులు నిలుపుదల చేసిన విషయంపై అభ్యంతరం చెప్పడంతో ఎస్‌ఐ అప్పల రాజు, సీఐ కన్నపరాజు జోక్యం చేసుకున్నారు. పోలీసులు ఇసుక లారీలను పంపించివేయడంతో వివాదం సద్దుమనిగింది.

ఆ హా.. కాశం..



నీలి నీలి ఆకాశం... దట్టంగా అలముకున్న తెల్లటి మేఘాలు... ఇవి ఆకాశంలో తెల్లటి కొండలు మాదిరిగా కనిపించాయి. కాకినాడ జిల్లా పిఠాపురం 216వ జాతీయ రహదారిపై కనిపించిన ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.
- పిఠాపురం (ఆంధ్రజ్యోతి)

ప్రధానమంత్రి స్వనిధి 2.0 పథకంపై అవగాహన

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి స్వనిధి 2.0 పథకంపై మంగళవారం మెప్మా జిల్లా కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ ప్రియంవద, ఎల్‌డీఎం సీహెచ్‌వీఎస్ ప్రసాద్ అధ్యక్షతన వీధి విక్రయదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మెప్మా సిబ్బంది, బ్యాంకర్లు హాజరయ్యారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, వీధి విక్రయదారులకు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు.



ఎస్పీ బిందుమాధవ్ దంపతులకు స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలు అందజేస్తున్న ఈవో జగన్మోహన శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్



పెద్దాపురంలో జీఎస్టీపై కరపత్రాన్ని ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప



పిఠాపురంలో గృహోపకరణాల షోరూమ్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ



జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పిస్తున్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

జీఎస్టీ 2.0 పేదలకు వరం

పెద్దాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు పేదలకు వరమని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై మంగళవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలు దేశ చరిత్రలో నూతన అధ్యాయమన్నారు. నాలుగు శ్లాబులుగా ఉండే జీఎస్టీని కేంద్రం రెండు శ్లాబులుగా చేసిందని... నిత్యావసర వస్తువులు, మందులపై జీరో శాతం జీఎస్టీ అమల్లోకి తెచ్చిందన్నారు. వ్యవసాయ యంత్రాలపై 12శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించడం ఎన్డీఏ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ గిఫ్ట్‌గా అభివర్ణించారు. ర్యాలీలో ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్, కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్‌తో డబుల్ బెనిఫిట్స్ అందుతున్నాయని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. నగరంలోని 33, 35, 40 డివిజన్లకు సంబంధించి సూపర్ జీ ఎస్టీ-సూపర్ సేవింగ్స్ అవగాహన సదస్సును కొత్తపేట బ్రిడ్జి దిగువన బసివిరెడ్డి వారి వీధి వద్ద మంగళవారం నిర్వహించారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు బచ్చు శేఖర్, గుజ్జు దుర్గలక్ష్మణరావు, గదుల సాయిబాబు, ఎస్‌కే రహీమ్, గోపిశెట్టి బూరయ్య, పసుపులేటి వెంకటేశ్వరరావు, అట్ల సత్యనారాయణ, విస్సంశెట్టి బాబ్జీ, ముత్యాల రాణి, నాదెళ్ల నరసింహారావు, మద్దూరి బాలకృష్ణ, మనోహరగుప్త, గోకర కొండ చిట్టిబాబు, రెడ్నం సత్తిబాబు, అబ్దుల్ రహీం, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ శ్లాబుల సవరణతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు అందించాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ వ్యాపారులకు సూచించారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం వద్ద గల గృహోపకరణాల షోరూమ్‌ను మంగళవారం ఆయన నాయకులతో కలిసి సందర్శించారు. ధరల తగ్గింపుపై కొనుగోలుదారులతో మాట్లాడారు. టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు బొజ్జా సతీష్, ఏలేరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సోము సత్యనారాయణ, నాయకులు కొండేపూడి సూర్యప్రకాష్, పిల్లి చిన్నా, నామా దొరబాబు, కోళ్ల బంగారుబాబు, మసకపల్లి రాజా తదితరులు పాల్గొన్నారు.

పాదగయలో ఎస్పీ పూజలు

పిఠాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రానికి ఎస్పీ బిందుమాధవ్ దంపతులు సోమవారం విచ్చేశారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి వేదపండితులు క్షేత్ర ప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనం ఇచ్చారు. ఎస్పీ దంపతులను ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు, స్వామి-అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్, ఆలయ సూపరింటెండెంట్ బి.వీరభద్రరావు, రెడ్నం ప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దత్తాత్రేయ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలో 'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

కాకినాడ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): 'ప్రపంచంలో పరివర్తన రావాలంటే ముందు నీలో మార్పు రావాలి' అంశంపై సత్యసాయి సేవా సంస్థల విద్యా విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఇందులో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆకుల సాయిపవన్ (ప్రథమ), బి.గంగాశ్రీదేవి (ద్వితీయ), జి.శరణ్య (తృతీయ) స్థానాల్లో నిలిచారు. విజేతలను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల కార్యదర్శి డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు, డాక్టర్ శ్యామల, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ అధికారి తేజేశ్వరరావు తదితరులు అభినందించారు.

'పోలీసుల ప్రాణత్యాగం చిరస్మరణీయం'

సామర్లకోట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీసుల సేవలు చిరస్మరణీయమని ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణార్థం పట్టణంలోని ప్రతిభ స్కూలు ఆవరణలో విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన పోటీ నిర్వహించి విజేతలకు ట్రాఫిక్ ఎస్ఐ బహుమతులు అందజేశారు. ప్రతిభ విద్యా సంస్థ కరస్పాండెంట్ ఎస్వీవీజీ ప్రకాష్, ప్రిన్సిపాల్ టి.సునీత, వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీగౌరి, ఉపాధ్యాయులు తోటకూర సాయిరామకృష్ణ, బ్రహ్మం పాల్గొన్నారు.



జేఎన్టీయూకే ఉప కులపతి ప్రసాద్‌తో డొక్కా సీతమ్మ స్ఫూర్తి పురస్కారాల గ్రహీతలు

డొక్కా సీతమ్మ స్ఫూర్తి పురస్కారాల ప్రదానం

జేఎన్టీయూకే, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అన్నదాతగా డొక్కా సీతమ్మ ప్రపంచానికి ఆదర్శనీయురాలని, ఆమె మన ప్రాంతంలో పుట్టడం మన అదృష్టమని జేఎన్టీయూకే ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. కాకినాడ జేఎన్టీయూ సమావేశ హాల్లో మంగళవారం ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ 184వ జయంతి వేడుకలను పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజా ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ప్రసాద్ 17 మంది ప్రముఖులకు డొక్కా సీతమ్మ స్ఫూర్తి పురస్కారాలను అందజేసి సత్కరించారు. వారిలో డైరెక్టర్ వి.సముద్ర, రియాజ్ అహ్మద్, అనపాల ఆంజనేయరెడ్డి తదితరులున్నారు. కార్యక్రమంలో తురగా సూర్యారావు, కృష్ణమాచార్యులు, సత్యనారాయణ, సినీ నిర్మాత సిరాజ్ పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలి: ఆర్జేసీ

పిఠాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో పాదగయ క్షేత్రానికి తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనరు వేండ్ర త్రినాథరావు ఆదేశించారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలో కార్తీకమాస ఏర్పాట్లపై ఆయన అధికారులతో సమీక్షించారు. నెల రోజులు భక్తులకు చేస్తున్న వివిధ ఏర్పాట్లపై ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ ఆర్జేసీకి నివేదిక అందజేశారు. పాదగయ పుష్కరిణి, దర్శనాలకు ఏర్పాటుచేసిన క్యూలైన్లు, అన్నదానం, టాయిలెట్లు, ఆలయ పరిసరాలను ఆర్జేసీ పరిశీలించి పలు సూచనలు చేశారు. సామాన్య భక్తులకు ప్రాధాన్యమిస్తూ శీఘ్రగతిన దర్శనాలు అయ్యేలా చూడాలన్నారు. చిన్నారులకు పాలు, బిస్కట్లు అందజేయాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాల కారణంగా భక్తుల రద్దీ గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. గతం కంటే 20శాతానికి పైగా అంచనాలు వేసుకుని అందుకు తగ్గ ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని సూచించారు. వైద్య శిబిరం, తాగునీరు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. ఈవో జగన్మోహనశ్రీనివాస్, దేవదాయ శాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు, తనిఖీదారు వడ్డి ఫణీంద్రకుమార్, ఈవోలు జోగా సత్యనారాయణ, ధనలక్ష్మి పాల్గొన్నారు.



పిఠాపురం పాదగయలో కార్తీక మాస ఏర్పాట్లపై ఈవోతో చర్చిస్తున్న ఆర్జేసీ త్రినాథరావు

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): భీమేశ్వరాలయంలో కార్తీక మాసోత్సవాల్లో భక్తులకు సదుపాయాల కల్పనపై దేవదాయ శాఖ ఆర్జేసీ వేండ్ర త్రినాథరావు, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ కె.నాగేశ్వరరావు సమీక్షించారు. మెరుగైన సదుపాయాలు కల్పించి దూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు శీఘ్రగతిన దర్శనం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిత్యాన్న దాన పథకంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. కోనేరు పుష్కరిణి, గోదావరి పుష్కరిణి, నిత్యాన్నదానం, భక్తులకు క్యూలైన్ల ఏర్పాట్లు, ఆలయ పరిసరాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. అంతకు ముందు భీమేశ్వరస్వామిని, బాలాత్రిపురసుందరి అమ్మవారిని దర్శించిన ఆర్జేసీ త్రినాథరావు, సీఎఫ్‌వో నాగేశ్వరరావు నంది మండపం వద్ద వేదాశీర్వచనంతో ప్రసాదాలు స్వీకరించారు.

బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

కాకినాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘ సమావేశం జిల్లా అధ్యక్షుడు రామానుజం శ్రీనివాస్ అధ్యక్షతన నగరంలోని రామారావుపేటలో మంగళవారం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా, కాకినాడ జిల్లా, కాకినాడ నగర కార్యవర్గ సభ్యుల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా వాసంశెట్టి కామేశ్వరరావు (విద్యా శాఖ), గౌరవ అధ్యక్షుడిగా రామానుజన్ శ్రీనివాస్ (విద్యుత్ శాఖ), ప్రధాన కార్యదర్శిగా జోగా రామకృష్ణ (వైద్య-ఆరోగ్య శాఖ), ఆర్థిక కార్యదర్శి నరసింహమూర్తి (విద్యా శాఖ), రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా గంటి రాధాకృష్ణ, కాకినాడ నగర శాఖ గౌరవాధ్యక్షుడిగా చోడే శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సంగాడి రాజసింహవర్మ, అధ్యక్షుడిగా కడలి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ముక్తేశ్, సంయుక్త కార్యదర్శిగా ములంపాక శ్రీనివాసరావు నియమితులయ్యారు. వీరిని రాష్ట్ర అధ్యక్షుడు వీరబ్రహ్మంతో పాటు పలువురు అభినందించారు. జిల్లాలోని కమిటీలు లేని మండలాలకు త్వరలో కార్యవర్గాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

'ఉద్యోగుల డిమాండ్లపై సీఎం స్పందన హర్షణీయం'

కాకినాడ సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల డిమాండ్లపై సీఎం స్పందన పట్ల ఉమ్మడి జిల్లా జేఏసీ చైర్మన్, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహరావు హర్షం వ్యక్తం చేశారు. నగరంలోని ఎన్జీవో హోంలో మంగళవారం జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించడం, ముఖ్యమంత్రి, మంత్రుల బృందంతో స్నేహపూర్వక చర్చలు జరగడం సంతోషకరమన్నారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా నాయకులు మట్టపర్తి వెంకటేశ్వరరావు, పాలపర్తి మూర్తి బాబు, సరెళ్ల చంద్రరావు, కేవీఎన్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు'

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని కార్పొరేషన్ అదనపు కమిషనరు కేటీ సుధాకర్ హెచ్చరించారు. మంగళవారం ఉదయం ఆయన నగరంలోని జన్మభూమి పార్కు, రామకృష్ణారావుపేట, బ్యాంకుపేట, మహాలక్ష్మినగర్, జె.రామారావుపేట, అన్నమ్మఘాటీ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యకలాపాలను పరిశీలించారు. సినిమా రోడ్డులోని పెట్రోలు బంకు వద్ద టిప్పర్ వాహనాలు గ్యాస్ నింపుకునేందుకు వేచి ఉన్నట్టు గమనించిన ఆయన విధుల్లో నిర్లక్ష్యం వహించిన డ్రైవర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నమ్మఘాటీ సెంటర్లో అన్న క్యాంటీన్‌ను సందర్శించి అల్పాహార నాణ్యతపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. 23వ డివిజన్ పరిధిలో తాగునీటి కుళాయి ద్వారా వస్తున్న నీటి నాణ్యతను పరిశీలించి తగిన సాంద్రత ఉందన్నారు. సర్కిల్ ఆఫీసుల్లోని రికార్డులను పరిశీలించారు.

ట్రంప్ విధించిన సుంకాలకు వ్యతిరేకంగా సీపీఎం ధర్నా

తాళ్లరేవు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భారతదేశంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలకు వ్యతిరేకంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కార్మిక నేతలు ధర్నా చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు ఆధ్వర్యంలో కార్మికులు ట్రంప్ దిష్టిబొమ్మను తగులబెట్టారు. కార్మిక నేతలు టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు, మోర్త రాజశేఖర్, అదృష్టదీపుడు, త్రిమూర్తులు, తణుకు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



పెనుగుదురులో ఐవీఆర్ఎస్ కాల్స్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

'ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'

కరప, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సలాది వెంకటశ్రీనివాసరావు సూచించారు. మంగళవారం ఉదయం ఆయన పెనుగుదురులో పర్యటించి తడి, పొడి చెత్తల సేకరణపై అవగాహన కల్పించారు. మహిళలతో సమావేశమై పరిసరాల పరిశుభ్రతకు తీసుకోవాల్సిన చర్యలు, తడి, పొడి చెత్తలను వేరుచేసే విధానం, ఐవీఆర్ఎస్ కాల్స్‌పై చర్చించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రెన్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, వీధిలైట్లను సక్రమంగా నిర్వహించాలని, ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి జీసీహెచ్ శ్రీకాంత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్ నూతన భవన నిర్మాణ పనుల పరిశీలన

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ నూతన కార్యాలయ భవన నిర్మాణాన్ని ప్రత్యేక అధికారి, కలెక్టర్ షాన్‌మోహన్ మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిని అదనపు కమిషనరు కేటీ సుధాకర్, సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.వెంకటరావు కలెక్టర్‌కు వివరించారు. చరిత్రాత్మకమైన పాత భవనంలో ప్రస్తుతం కౌన్సిల్ సమావేశాలు మాత్రమే నిర్వహిస్తున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నూతన భవనం త్వరిగతిన పూర్తయ్యేందుకు అవసరమైన నిధుల విడుదల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, డీసీపీ కృష్ణారావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, ఏఈలు, డీఈలు పాల్గొన్నారు.

'రాజకీయాలకతీతంగా కాపు వనసమారాధన'

సర్పవరం జంక్షన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాపు సద్భావనా సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 16న రాజకీయాలకతీతంగా కాపు వనసమారాధన నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. ఆర్టీవో కార్యాలయ రోడ్డులోని శుభం కాపు కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన కాపు సద్భావనా సంఘం జీవితకాల సభ్యులు, కార్యవర్గ సభ్యుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజకీయ ఉపన్యాసాలు లేకుండా కార్యక్రమం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండేళ్లకోసారి కార్యవర్గాన్ని మార్పు చేసేందుకు నిర్ణయించారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ఎస్ ధర్నా

కాకినాడ సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించిన వ్యక్తితో పాటు అతడి వెనుక ఉన్న శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు సమర్పించారు. ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బజ్జంగి సుధాకర్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బోడపాటి మరియ, జిల్లా నాయకులు యార్లగడ్డ ప్రసాద్‌రాజు, శీలి జాని, పలివెల విజయ్, తాతపూడి మూర్తి పాల్గొన్నారు.

పిఠాపురంలో భారీ వర్షం

పిఠాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం రాత్రి సుమారు గంటకు పైగా భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. డ్రైన్లు పొంగిపొర్లి రోడ్లపై నీరు ప్రవహించింది. దీంతో వాహనచోదకులు ఇక్కట్లు పడ్డారు. ఈదురుగాలులు వీయడంతో పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.





సామర్లకోట మండలం అచ్చంపేటలో మతాబులు కాలుస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప, కాకినాడలో కుటుంబ సభ్యులతో కలిసి కాకరపువ్వొత్తులు కాలుస్తున్న ఎమ్మెల్యే నానాజీ, పిఠాపురంలో చిచ్చుబుడ్డి వెలుగు

దీపావళి సంబరాలు

సామర్లకోట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణం, మండలంలో దీపావళిని ఘనంగా జరుపుకున్నారు. అచ్చంపేటలోని తన స్వగృహంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కుటుంబసభ్యులతో కలిసి మతాబులు కాల్చారు. పలువురు జైనులు, మార్వాడీలు లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేసి పరస్పరం దీపావళి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కుమారుడు సందీప్, కోడలు బిందుశ్రీలేఖ, కుటుంబ సభ్యులతో కలసి దీపావళి జరుపుకున్నారు. క్రాకర్లు, చిచ్చుబుడ్లు, మతాబులు, బాంబులు కాల్చారు. తొలుత నిరుపేదలకు దీపావళి సామాన్లు, స్వీట్లు పంపిణీ చేశారు. జనసేన నాయకులకు, కార్యకర్తలకు స్వీట్లు పంచి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

పిఠాపురం/గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు మండలాల పరిధిలోని గ్రామాల్లో దీపావళిని ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. సంప్రదాయం ఉన్న వారు ఇళ్ల వద్ద దివిటీలు వెలిగించి కొట్టారు. చిన్నారులు కాకర పువ్వొత్తులు, రకరకాల అగిపెట్టెలు, పాము బిళ్లలు, అనకొండలు వెలిగించారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో పలుచోట్ల పోటాపోటీగా బాణసంచా కాల్చి సందడి చేశారు. గృహాలన్నీ దీపాలతో వెలుగులు విరజిమ్మాయి.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలో దీపావళిని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. సోమవారం సాయంత్రం చీకటిపడ్డాక ఇంటి ముంగిట చిన్నారులతో గోంగూర కర్రలతో దిబ్బిదిబ్బి దీపావళి... మళ్లీమళ్లీ వచ్చే నాగులచవితి అనిపిస్తూ పెద్దలు దివిటీలు కొట్టించారు. లక్ష్మీ పూజ అనంతరం ఇంట్లో తయారుచేసిన తీపి వంటకాలను భుజించారు. అనంతరం మతాబులు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు, బాంబులు, టపాసులు కాల్చారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువరానివి

ప్రత్తిపాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు మరువరానివని ప్రత్తిపాడు ఎస్ఐ లక్ష్మీకాంతం చెప్పారు. ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు ఎస్ఐ పూలమాల వేసి నివాళులర్పించారు. విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చరిత్రలో నిలిచి పోతాయని కొనియాడారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పోలీసు అమరవీరులకు ఘన నివాళి



చింతూరులో మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

చింతూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చింతూరులో మంగళవారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా జరిగింది. పోలీసులు ర్యాలీ, మానవహారం కార్యక్ర మాలు నిర్వ హించారు. కార్యక్రమంలో విద్యార్థులు స్థానికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐ గోపాలకృష్ణ, ఎస్ఐ రమేష్, సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ దివాకర్ పాల్గొన్నారు.

మోతుగూడెంలో..



మోతుగూడెం,(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పోలీస్ స్టేషన్ నుంచి ఎస్ఐ చరణ్ నాయక్ పోలీస్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ 42 పోలీస్ సిబ్బంది, విద్యా ర్థులతో కలిసి ర్యాలీగా మార్కెట్ సెంటర్‌నుంచి జగదాంబ సెంటర్లో పోలీసులు అమరవీరుల స్థూపం దగ్గరికి ర్యాలీగా వచ్చారు అమర వీరులు స్థూపానికి మోతుగూడెం ఎస్ఐ చరణ్‌నాయక్, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ రాజారావు సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ చెన్నకామేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.బాలకృష్ణ, సర్పంచ్ ఆకేటి సీత పూలమాలతో నివాళు లర్పించారు. సివిల్ పోలీసులు ఎస్ఏ రాజేశ్వరరావు, హెడ్ కానిస్టే బుల్స్ నిబంధన శ్రీనివాస్ మురళి, తదితరులు సీఆర్పీఎఫ్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు. వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయిలో సివిల్ పోలీసులు, సీఆర్పీఫ్ సిబ్బంది పోలీసుల అమరవీరుల దినోత్సవం నిర్వహించారు.

ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యం

దేవీపట్నం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):మండలంలో ఇందు కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల న్యాయసేవ అధికార సంస్థ మరియు ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యం లో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే దశలోనే సమాజంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ వలంటీర్స్ యాలగడ్డ నాగేశ్వరరావు, చోడి ప్రదీప్‌కుమార్ దొర, కంగాల అబ్బాయి దొర, చోడి ఏడు కొండలరావు దొర, కలుముల జోగిరాజు దొర, పీతా ప్రసాద్ పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యానికి గర్భిణి మృతి

● బాధ్యులపై చర్యలు తీసుకోవాలి ● ఆదివాసీ సంక్షేమ పరిషత్



రంపచోడవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి అయ్యిందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన కోటం బాపనమ్మ ప్రసవం కోసం 12రోజులు ముందుగానే జాయిన్ అయ్యిందని, 19న (ఆదివారం) ఉదయం ప్రసవ కాన్పు సమయం దగ్గరవ్వడంతో ఆసుపత్రి సిబ్బంది బలవంతంగా డెలీవరి చేసే ప్రయత్నంలో మృత్యువాత పడిందని ఆరోపించారు. ఆదివారం రాత్రి వరకు ఆసుపత్రిలోనే ఉంచి పరిస్థితి విషమించాక బాలింతరాలిని రాజమహేంద్రవరం రిఫర్ చేయడం డాక్టర్ల నిర్లక్ష్యమేనని అన్నారు. మాత, శిశు మరణాలపై కఠినచర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. బాపనమ్మ మృతికి కారకులపై విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ ఉపాధ్యక్షుడు బొరగ ఎర్రమ్మ, ప్రధాన కార్యదర్శి జోడి ప్రదీప్ కుమార్‌దొర, డివిజన్ నాయకులు కంగల అబ్బాయిదొర, చోడి ఏడు కొండలరావు, పరదా శిరామకృష్ణదొర, కలుముల జోగిరాజు దొర పాల్గొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి



రైతు వీరభద్రస్వామి(ఫైల్)

ఎటపాక, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల వచ్చిన గోదావరి వరదలు,వర్షాల కారణంగా పంట సాగు ఆలస్యమ వుతుందనే మనోవేదనకు గురైె రైతు గుండెపోటుతో ఆదివారం అర్ధరాత్రి మృతి చెం దాడు. వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి జిల్లా ఎట పాక మండలం మురుమూరు గ్రామానికి చెందిన పడాల వీరభద్రస్వామి (45) తనకున్న ఎకరం పోలంతోపాటు మరో ఎకరం కౌలుకు తీసుకుని ప్రతీ ఏటా రెండెకరాలు మిర్చి సాగు చేస్తుంటాడు. అయితే ఈ ఏడాది మొన్నటి వరకు వర్షాలు, వరదలు రావడంతో సాగుచేసే పోలాలు నీటము నిగాయి. దీంతో పొలాలు తడి ఆరకపోవడంతోపాటు మిర్చిసాగు చేసేందుకు వీలులేకపోవడంతో పంటసాగు ఆలస్యమవుతుందని భావించాడు. ఈనేపథ్యంలో మనోవేదనకు లోనై ఇంటి వద్దనే గుండెపోటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లేలోపు మృతి చెందాడు.

సత్యదేవుడి దీక్షా దుస్తుల పంపిణీ

కూనవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):శ్రీ అన్నవరం సత్యనారాయణ స్వామి మాల దీక్ష దుస్తులను పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఎడవల్లి భాస్కరరావు చేతుల మీదు గా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ విలీన మండలాల ప్రజలకు అన్నవరం సత్యనారాయణ స్వామి ట్రస్ట్ భక్తులకు ఉచితంగా మాలతోపాటు దీక్షకు సంబంధించిన దుస్తులను పంపిణీ చేయడం సంతోషకరమైన విష యం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కన్యకా పరమేశ్వరి టీడీపీ మండల కార్యదర్శి పోడియం అప్పాలరావు పారి సోమయ్య పాల్గొన్నారు.

వరదసాయం కోసం ఎదురుచూపులు

కూనవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):ఇటీవల వచ్చిన కారణంగా వరద సాయం అందించేందుకు ప్రభుత్వం ముందుకు రావడంతో ఆ సాయం కోసం వరద బాధితులు ఎదురుచూస్తున్నారు. ఈ ప్రాంతంలో మూడు నెలల్లో 30 రోజులపాటు గోదావరి వచ్చింది దీంతో ప్రభుత్వం ప్రతి కుటుంబానికి మూడు వేల రూపాయలు ఇచ్చేందుకుగాను బాధితుల నుంచి నెంబర్ రేషన్ డీలర్ల సేకరించారు. వరదల కారణంగా ఈ ప్రాంతంలో ఎటువంటి కూలి పనులు దొరక్కపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బద్రినాథ్ టూ రామేశ్వరం

● కాలినడక బయలుదేరిన రామభక్తులు



చింతూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కొందరు రామ భక్తులు బద్రినాథ్ నుంచి రామేశ్వరం కాలినడకన బయలు దేరారు. మంగళవారం ఈ బృందం వయా చింతూరు మీదుగా తెలంగాణలోని భద్రాచలంవైపు వెళుతూ కొద్ది నిమిషాలు అల్లూరిసీతారామరాజు జిల్లా చింతూరు మండలం చట్టి సమీపంలో రహదారిని ఆనుకొని ఉన్న చెట్టు నీడన స్వేధ తీరతూ కన్పించారు. ఈ క్రమంలో ఆ బృందాన్ని ఆంధ్రజ్యోతి పలకరించింది. ఈ సందర్భంగా వారిలో ఒకరైన రామభక్తుడు రుక్విష్ మాట్లాడుతూ తమది ఉత్తరాఖాండ్ రాష్ట్రమన్నారు. కొద్ది నెలల క్రితం బద్రినాథ్ నుంచి తమ యాత్ర కాలినడకన తమిళనాడులోని రామేశ్వరంనకు బయలుదేరిందన్నారు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ చివరకు తమిళనాడు వరకు తమ యాత్ర సాగనుందన్నారు. ప్రతి రాష్ట్రంలోని దేవాలయాలను దర్శించుకుంటూ తమ యాత్ర సాగుతుందన్నారు. ఈ క్రమంలో తెలంగాణలోని భద్రాద్రి రామయ్యను కనులారా వీక్షించి అక్కడి నుంచి తిరిగి తమ పయనం మొదలవుతుందన్నారు.

ఆనందోత్సాహాలతో దీపావళి వేడుకలు





ఏలేశ్వరంలో బాణసంచా కాలుస్తున్న చిన్నారులు, కోటనందూరు : జగన్నాథపురం రామాలయంలో ప్రమిదలను వెలిగిస్తున్న మహిళలు

ఏలేశ్వరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):దీపావళి పండుగను ఏలేశ్వరం పట్టణ, రూరల్ ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఇళ్లలో దీపాలు వెలిగించి లక్ష్మీ దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దివిటీలు కొట్టి దీపావళి బాణసంచా కాల్చి సందడి చేశారు.

జగ్గంపేట, (ఆంధ్రజ్యోతి): స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలుర హాస్టల్, బాలికల హాస్టల్‌లో జగ్గంపేట టౌన్ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో దీపావళి వేడుకలు నిర్వహించారు. జగ్గంపేట మండలాధ్యక్షుడు జీను మణిబాబు సమకూర్చిన దీపావళి టపాసులు, స్వీట్స్ విద్యార్థులందరికీ పంపిణీ చేశారు. ఎస్వీఎస్ అప్పలరాజు, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, రాయి సాయి, వేలిశెట్టి బుజ్జి, కోడూరి రమేష్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): మండలగ్రామాల్లో ఇళ్లను విద్యుత్ దీపాలంకరణలు చేసి లక్ష్మీదేవికి పూజలు చేసి దీపావళి సామగ్రి కాల్చుతూ సందడి చేశారు. పెదశంకర్లపూడిలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా నివాస గృహం వద్ద వేడుక నిర్వహించారు.

రౌతులపూడి,(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు పిల్లలతో కలిసి టపాసులు వెలిగించి ఆనందగా గడిపారు. దీపావళిని ఘనంగా జరుపుకున్నారు.

కోటనందూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలో దీపావళి వేడుకలు నిర్వహించారు. మహిళలు శ్రీదుర్గాదేవి ఆలయానికి వెళ్లిపూజలు చేశారు.జగన్నాధపురం రామాలయంలో మహిళలు ప్రమిదులు వెలిగించారు.

భౌతికశాస్త్రంపై విద్యార్థులకు అవగాహన

ఏలేశ్వరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు భౌతికశాస్త్రంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల పూర్వ విద్యార్థి వెన్నా వీరవెంకట సత్యనారాయణ ఢిల్లీ విశ్వవిద్యాలయంలో శాస్త్రవేత్తగా పనిచేయడం గర్వ కారణమని ప్రిన్సిపాల్ రాజశేఖర్ అన్నారు. ఆయన పలు పోటీ పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సత్యనారాయణను ఉపాధ్యాయులు శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు.

రేపు ధర్మవరంలో లక్ష బిల్వార్చన, అఖండ హారతి పూజలు

ప్రత్తిపాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో ఈనెల 23న లక్ష బిల్వార్చన, అఖండ హారతి ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. గ్రామంలోని ముదునూరి మురళీరాజు సామిల్లు ప్రాంగణంలో లక్ష బిల్వార్చన, గణపతి హోమం, 108కలశాలతో కన్యలు, అయ్యప్ప స్వాముల ఊరేగింపు, సాయంత్రం పడిపూజ, అఖండ హారతి నిర్వహించనున్నారు. పూజా కార్యక్రమాలకు మంగళవారం ముదునూరి నివాసం వద్ద కొమ్మలతో తీసుకొచ్చిన బిల్వాపత్రాలను కొమ్మల నుంచి వేరు చేస్తున్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన రాజా



కోటనందూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జగన్నాధపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత గుడివాడ ప్రసాద్ కుమారుడు ఎన్ఆర్ఐ గుడివాడ రాజా ఆస్ట్రేలియాలో సిడ్నీలో ఐటీ మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎంపీపీ గంటిమళ్లకు పితృ వియోగం

రౌతులపూడి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మికి పితృవియోగం కలిగింది. స్వగ్రామం రామ కృష్ణాపురంలో సన్యాసిరావు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఎంపీపీని కూటమి నాయకులు పరామర్శించారు.

చెప్పుల దుకాణంలో అగ్ని ప్రమాదం

శంఖవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శంఖవరంలో పడాల జోగి రాజుకు చెందిన చెప్పుల దుకాణంలో అగ్నిప్రమాదం జరిగింది. చెప్పులు పూర్తిగా కాలిపోయి ఆర్థిక నష్టం కలిగింది. టీడీపీ నేత పర్వత సురేష్ దుకా ణాన్ని పరిశీలించి జోగిరాజును పరామర్శించి ఆదుకుంటామని హామి నిచ్చారు.

ఓటర్ల నమోదు చేపట్టండి

ప్రత్తిపాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఓటర్ల నమోదు ముమ్మరంగా చేపట్టాలని అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ ఎంసూర్యప్రభ చెప్పారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇతర ఎన్నికల అధికారులతో సమావేశం జరిపారు. సమావేశంలో తహశీల్దార్లు నరేష్, కిరణ్ కుమార్ తదితరులతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు కొండపల్లి శ్రీనివాస్, సేరు కృష్ణ, మదినే బాబ్జి పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన సదస్సు

తుని రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఉత్పత్తులు, ఎగుమతులపై మంగళవారం పట్టణ రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానశాఖాధికారి సిరిల్, అగ్రికల్చర్ అండ్ ప్రాసెసింగ్ ఫుడ్ ప్రోడక్ట్ ఎక్స్‌ఫోర్ట్ డెవలప్‌మెంట్ (అపెడా) అధికారి పెద్ద స్వామి, శాస్త్రవేత్త శర్మ పలు అంశాలపై మాట్లాడారు. తుని ఉద్యాన అధికారిణి సుజాత, ఎఫ్‌పీవో సంఘాల రైతులు, ప్రకృతి వ్యవసాయ రైతులు, తుని, తొండంగి, కోటనందూరు వీహెచ్ఏలు పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

గండేపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి వ్యవసాయ శాఖ కార్యాలయ ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభిస్తామని వ్యవసాయశాఖ ఏవో జె.లక్ష్మి తెలిపారు. దీనికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా అధికారులు హాజరవుతారని ఆయన తెలిపారు.

బూరుగుపూడిలో ఉద్యాన పంటలపై శిక్షణ

కిర్లంపూడి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బూరుగుపూడిలో ఉద్యాన పంటల్లో సమగ్ర సస్యరక్షణ, మేలైన ఎరువుల యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. రాజమండ్రి ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వెంకట నరసింహారావు ఉద్యాన పంటల్లో పాటించాల్సిన ఎరువుల యాజమాన్యంపై రైతులకు వివరించారు. ఉద్యాన అధికారి కె.దివ్యశ్రీ, బూరుగుపూడి ఉప సర్పంచ్ పాటుంశెట్టి కృష్ణమూర్తి, ఆశపు వీరభద్రరావు, పాటంశెట్టి రవి, కుంచె తాతాజీ, పంచాయతీ కార్యదర్శి పాలాటి నూకరాజు, గ్రామ ఉద్యాన సహాయకులు ఎం.హరిత, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన బాలికల క్రీడా పోటీలు

తొండంగి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన మండలస్థాయి క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. రావికంపాడు ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో అండర్ 14 విభాగం కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో రావికంపాడు విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఖోఖోలో దానవాయిపేట, యోగాలో ఏ.కొత్తపల్లి, చెస్‌లో కేజీబీవీ ఉన్నత పాఠశాలలు విజేతలుగా నిలిచాయి. ఖోఖోలో కెజీబీవీ, యోగాలో ఏ.కొత్తపల్లి ఉన్నత పాఠశాలలు విజేతలుగా నిలిచాయి. విజేతలకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బీ.ప్రసాద్, గేమ్స్ ఫెడరేషన్ కోఆర్డినేటర్ నర్సింహమూర్తి బహుమతులు అందించారు.

'అధ్వానంగా రహదారుల పరిస్థితి'

జగ్గంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరిగానే పాలన సాగిస్తున్నదని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జుత్తుక నాగేశ్వరరావు విమర్శించారు. కాట్రావులపల్లి నుంచి కాకినాడ రోడ్డు.. రామవరం- రాజుపాలెం రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. జగ్గంపేట రోడ్డును ఏళ్ల తరబడి నీరుగారుస్తున్నారని ఆరోపించారు

ఘనంగా ఆకాశదీపం పూజలు

శంఖవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం ఆకాశదీపం పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి త్రినాధశర్మ ఆధ్వర్యంలో ధ్వజస్తంభంపై ఆకాశదీపాన్ని వేలాడదేసి పూజలు చేశారు.

నరకాసుర వధ, సతీ అనసూయ ప్రదర్శనలు



ధర్మవరంలో నరకాసుర వధ కళారూపకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

ప్రత్తిపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో గౌరీశంకర్ల 89వ వార్షికోత్సవంలో భాగంగా దీపావళి పురస్కరించుకుని ప్రదర్శించిన నరకాసురవధ, మంగళవారం సతీ అనసూయ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నరకాసుర వధలో శ్రీకృష్ణుడుగా రాయి శివ, సత్యభామగా చెన్నాడ శివ తాతారావు, నారదుడుగా పోసంశెట్టి వాసు, నరకాసురుడుగా మట్టా నాగబాబు నటించారు. సతీ అనసూయ కళా ప్రదర్శనలో శివుడుగా తోట ప్రసాద్, నర్మదగా బలిజ వీర్రాజు, నర్మద భర్తగా రెడ్డిపల్లి శ్రీను, లక్ష్మిగా గరగ వీరబాబు, పార్వతిగా దండా అనీల్, సరస్వతిగా దండా గొల్లబాబు నటించారు.

ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలి



నీలాద్రిరావుపేటలో చెత్త సేకరణపై ప్రజలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్

గండేపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వారానికి రెండుసార్లు పంచాయతీ చెత్త సేకరణ వాహనాలు ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ సిబ్బందికి సూచించారు. ఆయన మంగళవారం నీలాద్రిరావుపేట గ్రామంలో పర్యటించి చెత్త సేకరణ వాహనాలు వారానికి రెండుసార్లు ఇంటింటికి వచ్చిన చెత్త సేకరణ చేస్తున్నారా లేదా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ వస్తున్నాయని వీటి ద్వారా చెత్త సేకరణపై మీ అభిప్రాయాలు చెప్పాలని ప్రజలకు ఆయన సూచించారు. చెత్త సేకరణలో పంచాయతీ సిబ్బంది నిరక్ష్యం వహించొద్దన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి బాల వీరేంద్ర చౌదరి తదితరులు ఉన్నారు.

ఆత్మ కమిటీ డైరెక్టర్లకు ఎమ్మెల్యే అభినందన



ప్రత్తిపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆత్మ కమిటీ డైరెక్టర్లను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అభినందించారు. రౌతులపూడి మండలం ఎం.కొత్తూరు గ్రామానికి చెందిన వంతు శ్రీను, రాఘవపట్నం గ్రామానికి చెందిన వంతు ఇజ్జమ్మ తుని జోన్ ఆత్మ కమిటీ డైరెక్టర్లుగా నియమితులయ్యారు. వారు అనుచరులతో కలిసి మండలంలోని పెదశంకర్లపూడి వచ్చి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాకప్పి బొకే అందజేశారు. ఇద్దరికి ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానించారు.

ఉప్పలపాడు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా లక్ష్మి

గండేపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉప్పలపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పర్సన్ ఇంచార్జ్‌గా జీవీ లక్ష్మిని నియమించారు. ఈమేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ ఆదేశాలు జారీ చేశారు. పెద్దాపురం సబ్ డివిజన్ కోపరేటివ్ కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఆమెను పర్సన్ ఇంచార్జ్‌గా నియమించారు.

అన్నక్యాంటీన్‌లో అన్నదానం

జగ్గంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రోడ్‌లోని ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నక్యాంటీన్‌లో జగ్గంపేటకు చెందిన ఐశ్వర్య ఎంటర్‌ప్రైజెస్ అధినేత కందుల వీరబాబు భువనేశ్వరి దంపతుల ఆర్థిక సహాయంతో పేదలకు అన్నదానం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు హాజరై పేదలకు అన్నం వడ్డించారు. టీడీపీ యువనేత పాలచర్ల నాగేంద్ర చౌదరి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, పాలచర్ల నాగేంద్ర చౌదరి, రాయిసాయి, వేములకొండ జోగారావు, మారిశెట్టి రాధా పాల్గొన్నారు. అలాగే జగ్గంపేట పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహించారు. తుమ్మలపల్లి హాజరై పేదలకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'ఆదిత్య' అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



ప్రొఫెసర్ గణేష్

గండేపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ ఈఈఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బల్ల శ్రీ సత్య గణేష్ పార్థు జేఎన్‌టీయూ కాకినాడ నుంచి డాక్టరేట్ సాధించినట్టు ఆదిత్య యూనివర్సిటీ ప్రోచాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. జేఎన్‌టీయూకే ఈఈఈ విభాగం విభాగాధిపతి ప్రొఫెసర్ డా.కె.వెంకటరెడ్డి నేతృత్వంలో శ్రీసత్యగణేష్ పార్థు సమర్పించిన థీసిస్ స్కీమ్స్ ఫర్ ఎఫెక్టివ్ ఇంటర్ కనెక్షన్ ఆఫ్ నాన్ కన్వెన్షనల్ ఎనర్జీ సోర్సెస్ టు ది గ్రిడ్ యూజింగ్ మల్టీలెవెల్ ఇన్వెర్టర్స్ అనే అంశానికి డాక్టరేట్ వచ్చిందన్నారు. ఆయనను యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డిప్యూటీ చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, వైస్ చాన్సలర్ ప్రో ఎంబి.శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.